సాక్షి ఆదిలాబాద్

గురువారం : 22 : మే : 2025



పుష్కర ఘాట్లపై మట్టికుప్పలు

బాసర గోదావరినది పుష్కరఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

8లో▸

Postinfo by India Post

సులభంగా.. వేగంగా! 9లో▸

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పోస్టల్ శాఖ డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తోంది. వినియోగదారులకు అందిస్తున్న సేవలు మరింత సులభతరం చేసేదిశగా ముందుకు సాగుతోంది.

గరిష్టం/కనిష్టం
31.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.



జైనథ్ మండలం పెన్‌గంగాలో వరద ప్రవాహం

కురిసింది వాన.. తడిసింది నేల

- చల్లబడ్డ వాతావరణం
- ఉక్కపోత నుంచి ఉపశమనం
- జిల్లా అంతటా మోస్తరు వర్షం

జిల్లాలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కురిసిన అకాల వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్ల బడింది. కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ జనానికి కొంత ఊరటనిచ్చింది. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 3 నుంచి మొదలైన వర్షం గంటపాటు కురిసింది. రాత్రి మళ్లీ చిరు జల్లులు కురిశాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఓ మోస్తరు నుంచి సాధారణ వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్‌రూరల్, మావల, నేరడిగొండ, ఇచ్చోడ, బేల, బజార్‌హత్నూర్, భీంపూర్, భోరజ్, జైనథ్ తదితర మండలాల్లో సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం పడింది. ఎగువ మహారాష్ట్రలో కురిసిన వర్షంతో పెన్‌గంగలో వరద పెరిగింది. జైనథ్ మండలం కౌట గ్రామ సమీపాన నదిలో ప్రవాహ ఉధృతి కనిపించింది. ఖరీఫ్‌కు ముందు వర్షాలు కురువడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతుంది. అయితే జొన్న పంట విక్రయించేందుకు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన రైతులు కొంత ఇబ్బందులు పడాల్సి వచ్చింది. – ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

న్యూస్‌రీల్

కొనసాగిన ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగింపజేస్తున్న సీఐ, టీపీబీవో

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన చౌక్‌ల్లో చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. సినిమారోడ్, అంబేడ్కర్‌చౌక్, శివాజీచౌక్ ఏరియాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వేసిన షెడ్లు, టేలాలను అధికారులు బుధవారం తొలగింపజేశారు. ఈ ప్రక్రియను డీఎస్పీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు పర్యవేక్షించారు. అధికారుల సూచన మేరకు పలువురు స్వచ్ఛందంగానే వాటిని తొలగించుకున్నారు. అనంతరం ప్రత్యామ్నాయంగా కేటాయించిన గణేశ్ థియేటర్ స్థలానికి తరలివెళ్లారు. టౌన్ ప్లానింగ్ అధికారులు సాయంత్రం వరకు అక్కడే ఉండి ప్రక్రియను పూర్తి చేశారు. కార్యక్రమంలో టీపీవో సుమలత, టీపీబీవో సాయికృష్ణ, టీపీఎస్ నవీన్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట చిరు వ్యాపారుల ధర్నా

తమ షెడ్లను తొలగించడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని చిరువ్యాపారులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ప్రత్యామ్నాయంగా కేటాయించిన స్థల ప్రొసీడింగ్‌లను తాత్కాలికంగా కాకుండా పర్మినెంట్ పదంతో జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యథావిధిగా తమ వ్యాపారాలను ప్రధాన చౌక్‌ల్లోనే కొనసాగించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఆర్డీవో వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారికి ఎంఐఎం, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మద్దతు తెలిపారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజా రెడ్డి, రాజేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్–8, 10, 12 విభాగంలో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు ఉంటాయని తెలిపారు. అర్హత కలిగిన వారు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8:30 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. వివరాలకు 9492136510 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 16 కేంద్రాలు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఐఈవో జాదవ్ గణేశ్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 4,035, ఒకేషనల్‌లో 106 మొత్తం 4,141 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 1,966 మంది, ఒకేషనల్‌లో 126 మంది కలిపి మొత్తం 2,092 మంది పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. పర్యవేక్షణ కోసం జిల్లా పరీక్షల కమిటీ, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్, ముగ్గురు కస్టోడియన్లు, 16 మంది సీఎస్, డీవోలు, ఇద్దరు ఏసీఎస్‌లను నియమించినట్లు తెలిపారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- ఈ సారి తొలకరి త్వరగా పలకరించే అవకాశం
- సాగుకు రైతుల సమాయత్తం
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- నేల తడిసాకే విత్తుకోవాలంటున్న అధికారులు



ట్రాక్టర్‌తో చదును చేస్తున్న రైతు

ఆదిలాబాద్‌అర్బన్: వానాకాలం (ఖరీఫ్) సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో అవసరమ య్యే విత్తనాలు, ఎరువులను ఆయా గ్రామాల రైతులకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే వర్షాలు పడే అవకాశాలున్నందున ఆ దిశగా అన్నదాతలు సైతం సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇప్పటికే దుక్కులు దున్నే పనులు జోరందుకున్నాయి. రొటవేటర్‌తో చదును చేయడం, పొలాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించడం వంటి పనులు కొనసాగుతున్నాయి. వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు విత్తేందుకు రైతులు రెడీ అవుతున్నారు. దీనికి తోడు ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించనున్నట్లు వాతావరణ శాఖ చెప్పిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా రైతులు సిద్ధమవుతున్నారు.

పంట మార్పిడిపై దృష్టి

గతేడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను మళ్లీ ఈ సీజన్‌లో వేయకుండా రైతులు పంట మార్పిడిపై దృష్టి సారిస్తున్నారు. గతంలో సోయా వేసిన నేలల్లో ఈ సారి పత్తి, కంది, అలాగే పత్తి వేసిన చోట ఈ సారి సోయా లేదా మొక్కజొన్న పంటల సాగు దిశగా ఆలోచన చేస్తున్నారు. అలాగే పెసర, మినుము అంతర పంటగా వేయాలని భావిస్తున్నారు. పంట మార్పిడిపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. మరికొందరు తక్కువ సమయంలో అధిక దిగుబడినిచ్చే పంటలు సాగుకు మొగ్గుచూపుతున్నారు.

6లక్షల ఎకరాల సాగు అంచనా..

జిల్లాలో ఈ ఏడాది 6 లక్షలకుపైగా ఎకరాల్లో పంటలు సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా పత్తి ఉండనుంది. తర్వాత సోయా, కంది, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, పెసర పంటలు ఉంటాయని భావిస్తున్నారు. కాగా ఈ ఏడాది ఎరువులు, విత్తనాలకు ఎలాంటి కొరత లేకుండా రైతులకు సరిపడా మించి అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ శాఖ చెబుతోంది.

గత అనుభవాల దృష్ట్యా..

గత అనుభవాల దృష్ట్యా రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని చాలామంది రైతులు గతంలో వర్షాలు సరిగా కురవక రెండు, మూడు సార్లు విత్తనాలు వేసిన సంఘటనలు ఉన్నాయి. దీంతో మళ్లీ మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయాల్సి రావడంతో వారిపై ఆర్థిక భారం పడడంతో పాటు కొందరికి నాసిరకం విత్తనాలు సరఫరా అయ్యాయి. పంట ఏపుగా పెరిగినా పూత, కాత లేకపోవడంతో నష్టపోవాల్సి వచ్చింది. వాటిని దృష్టిలో ఉంచుకొని ఈ సారి ముందుకు సాగుతున్నారు. వ్యవసాయ శాఖ సైతం ఈ సారి అంచనాకు మించి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాయని వెల్లడించడంతో మార్కెట్‌లో డిమాండ్ రకం విత్తన ప్యాకెట్లు విరివిగా లభ్యమయ్యే అవకాశాలున్నాయి.

ఈ ఏడాది పంటల సాగు అంచనా..

పంట రకం	సాగు (ఎకరాల్లో)	అవసరమయ్యే విత్తనాలు(క్వింటాళ్లలో)
పత్తి	4,40,000	11,00,840 ప్యాకెట్లు
సోయాబీన్	62,500	18,725
కంది	55,000	21,960
జొన్న	1600	66
మొక్కజొన్న	23000	1,834
వరి	1900	489
పెసర	550	22
మినుము	550	44
ఇతర పంటలు	250	12

నేల తడిసాకే విత్తుకోవాలి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు చూసి విత్తనాలు వేసుకోవద్దు. వర్షాకాలం ప్రారంభానికి ఇంకా సమయం ఉంది. క్రమం తప్పకుండా కురిసి భూమి కొంత లోతు వరకు తడిసాకే విత్తుకోవాలి. తేలికపాటి వర్షాలకు వేసినట్లయితే ఎండ వేడిమికి నేల పొడిబారి విత్తనాలు చెడిపోయే అవకాశం ఉంది. ఈ సారి సరిపడా మించి ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాం. ఎలాంటి ఆందోళన అవసరం లేదు.

– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

వడపోత పక్కానేనా..!?

- ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల గుర్తింపునకు కొనసాగుతున్న ప్రక్రియ
- ఈపీఎఫ్, ఈఎస్‌ఐ ఎన్‌వోసీలపై ఆరా..
- బడా ఏజెన్సీల తీరుపై విమర్శలు



జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: 'ఎక్స్' అనే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎంప్యానల్‌మెంట్‌లో గుర్తింపు పొంది ఉంది. ఆయా జిల్లాల్లో వివిధ శాఖల్లో వర్క్ ఆర్డర్ పొంది ఉద్యోగుల నిర్వహణ చేస్తుంది. అయితే ఒకట్రెండు జిల్లాల్లో ఉద్యోగులకు సంబంధించిన ఈపీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లింపులు చేసిన సదరు ఏజెన్సీ మిగతా జిల్లాల్లో మాత్రం విస్మరించింది. చెల్లింపు చేసిన శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకొని ఆ పత్రాలను వేరే జిల్లాల్లో దరఖాస్తుతో జత పరిచారు. తద్వారా ఏజెన్సీ ఇతర జిల్లాల్లోని అక్రమ బాగోతం పైకి కనిపించకుండా పోతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలో కొత్త ఎంప్యానల్‌మెంట్ కోసం అనేక దరఖాస్తులు రాగా, ఆ ఏజెన్సీల అసలు బాగోతాలను సూక్ష్మంగా పరిశీలించాలన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతుంది.

కొనసాగుతున్న పరిశీలన..

జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల గుర్తింపునకు సంబంధించి కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటు కోసం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 2 నుంచి 13వరకు జిల్లా ఉపాధికల్పన శాఖ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. 32 దరఖాస్తులు విక్రయించగా, 29 ఏజెన్సీలు దరఖాస్తు చేసుకున్నాయి. కాగా గత 14వ తేదీన అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సమక్షంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ టెండర్ తెరిచారు. అందులో ఒక ఏజెన్సీ వివిధ సర్టిఫికెట్లు లేని కారణంగా తిరస్కరణకు గురైంది. మిగతా 28 ఏజెన్సీలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ప్రస్తుతం కొనసాగుతుంది. అయితే ఇందులో దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీల్లో కొన్ని రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎంప్యానల్‌మెంట్‌లో గుర్తింపు కలిగి ఉన్నాయి. ఆ ఏజెన్సీలు కొన్ని జిల్లాల్లో ఉద్యోగులకు సంబంధించి ఈపీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లింపులు చేసినప్పటికీ పలు జిల్లాల్లో వాటిని చెల్లించకుండా ఉద్యోగుల ప్రయోజనాలను కాలరాశారనే అపవాదు ఉంది. అయితే ఏయే జిల్లాలోనైతే ఈపీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించారో ఆ సర్టిఫికెట్లను ఈ కొత్త ఎంప్యానల్‌మెంట్‌లో చోటు కోసం దరఖాస్తుతో పాటు జతచేశారు. ఈ నేపథ్యంలో ఆయా ఏజెన్సీలు ఏయే జిల్లాలోనైతే ఎంప్యానల్‌మెంట్‌లో చోటు కలిగి ఉన్నాయో, అక్కడ ఏయే శాఖల్లో వర్క్ ఆర్డర్ కలిగి ఉన్నాయో, అన్నింటి నుంచి ఎన్‌వోసీలను సూక్ష్మంగా పరిశీలించాలని పలు ఏజెన్సీల నిర్వాహకులు పేర్కొంటున్నారు. కొంత మంది బడా ఏజెన్సీలు అధికారులను మచ్చిక చేసుకొని ఇలాంటి బాగోతాలను తెరపైకి రానివ్వకుండా చూసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. జిల్లాలో కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటులో ఉన్నతాధికారులు పారదర్శకంగా వ్యవహరించి అన్ని అర్హతలు ఉన్న ఏజెన్సీలనే పరిగణలోకి తీసుకోవాలని, తద్వారా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వారి ప్రయోజనాలు పూర్తిగా దక్కేలా అధికారులు చూడాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది.

సూక్ష్మంగా పరిశీలన చేస్తున్నాం..

కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుంది. ప్రస్తుతం లేబర్, కాంట్రాక్ట్ లైసెన్స్‌ల పరిశీలన చివరి దశలో ఉంది. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ, జీఎస్టీ ఇలా అన్ని అంశాల్లో ఏజెన్సీలకు సంబంధించి ఏయే జిల్లాల్లోనైతే వారు వర్క్ ఆర్డర్ పొంది ఉద్యోగుల నిర్వహణ చేస్తున్నారో ఆయా జిల్లాల్లో నుంచి శాఖల వారీగా ఎన్‌వోసీలను పరిశీలన చేస్తున్నాం. కమిటీ ఆధ్వర్యంలో అన్ని అంశాలను లోతుగా పరిశీలన చేసి లిస్టును ఫైనల్ చేయడం జరుగుతుంది. జాబితా పెట్టిన తర్వాత ఇతర ఏజెన్సీల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు ఒకట్రెండు రోజులు గడువు కూడా ఇస్తాం.

– మిల్కా, ఉపాధికల్పన శాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారి

'ఉపాధి' పనుల్లో నాణ్యత పాటించాలి



కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని చిట్యాల్‌బోరి, కచికంటి, యాపల్‌గూడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. యాపల్‌గూడలో రామాలయ ఆవరణలో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుక్నారు. కూలీలతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. పనుల నాణ్యత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఈ ఏడాది సాధ్యమైనంత త్వరగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఈజీఎస్ ఏపీవో జాకిర్ ఉస్సేన్, పీఆర్ ఎఈ సంతోష్, తదితరులు ఉన్నారు.

బైక్‌పై వెళ్లిన కలెక్టర్..



బైక్‌పై వెళ్తున్న కలెక్టర్ రాజర్షి షా

మండలంలోని చిట్యాల్‌బోరి శివారు అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పనులు కొనసాగుతుండగా అక్కడికి కారు వెళ్లేందుకు రోడ్డు మార్గం సరిగా లేదు. ఈ క్రమంలో కలెక్టర్ ఇలా ఐకేపీ ఏపీవో జాకీర్ హుస్సేన్ బైక్‌పై వెళ్లారు.

బడిబాట పట్టేనా?

- ప్రణాళిక సిద్ధం చేస్తున్న విద్యాశాఖ
- వచ్చే నెల 6 నుంచి 19 వరకు కార్యక్రమాలు
- సర్కారు బడుల్లో పిల్లల్ని చేర్పించడమే లక్ష్యం
- ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల ప్రచార హోరు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల బలోపేతం కోసం ప్రభుత్వం ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఏటా చేపడుతుంది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం జూన్ 6 నుంచి 19 వరకు ప్రత్యేక కార్యక్రమాలను ఖరారు చేసింది. కొత్తగా చేరే వారితో పాటు బడిబయటి పిల్లల్ని పాఠశాలలో చేర్పించడమే ప్రధాన లక్ష్యం. గతేడాది నెల పాటు నిర్వహించినా ఆశించిన ప్రగతి సాధించలేదు. ప్రైవేట్‌లోనే విద్యార్థులు అధిక సంఖ్యలో చేరారు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం సర్కారు బడులపై ప్రత్యేక దృష్టి సారించింది. మౌలిక వసతుల కల్పనతో పాటు ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు చేపట్టింది. మెగా డీఎస్సీద్వారా ఖాళీ పోస్టులను భర్తీ చేసింది. ప్రస్తుతం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. పక్షం పాటు పండగ వాతావరణం కల్పించేలా ప్రణాళిక రూపొందించింది. అయితే విద్యార్థులు ఈ ఏడాది ఏ మేరకు సర్కారు బడుల్లో చేరుతారో వేచి చూడాల్సిందే.



ఇటీవల బడిబాట నిర్వహించిన కేఆర్‌కే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు

బడిబయట పిల్లలు చేరేనా..

ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో విద్యాశాఖ పలు కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ డ్రాపౌట్ సంఖ్య మాత్రం తగ్గడం లేదు. బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించినా మళ్లీ చెత్తకుప్పల వెంట, హోటళ్లు, లాడ్జిలు, తదితర పరిశ్రమల్లో పనిచేస్తూనే ఉన్నారు. వారం, పది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించినా అనుబంధ శాఖలు పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారవుతుందని పలువురు పేర్కొంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 500కు పైగా బడిబయట పిల్లలు ఉన్నట్లు చెబుతున్నారు. అనధికారికంగా ఈ సంఖ్య వెయ్యికి పైనే ఉంటుందని సమాచారం. ఇదిలా ఉండగా పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు సన్నద్ధమవుతున్నారు.

లక్ష్యం నెరవేరేనా..

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇప్పటికే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విస్తృతంగా ప్రచారం చేపడుతున్నాయి. తల్లిదండ్రులను మభ్యపెట్టి తమ పాఠశాలల్లో చేర్పించుకుంటున్నారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్‌లోనే అడ్మిషన్లు అధికంగా కావడం గమనార్హం. ఈ ఏడాదైనా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందా అని పలువురు చర్చించుకుంటున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం

బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి సర్కారు బడిలో చేర్పించేలా చర్యలు చేపడతాం. జూన్ 6 నుంచి 19 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారు. నాణ్యమైన విద్య అందుతుంది.

– ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

చేపట్టే కార్యక్రమాలివే..

జయశంకర్ బడిబాట సందర్భంగా జూన్ 6 నుంచి 19 వరకు రోజువారీగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

- జూన్ 6న ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో గ్రామసభ నిర్వహించాలి.
- 7న ఉపాధ్యాయులు ఇంటింటా సందర్శించి బడీడు పిల్లలను గుర్తించాలి.
- 8 నుంచి 10 వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించడం, అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించడం, డ్రాప్‌అవుట్‌ను గుర్తించి బడుల్లో చేర్పించేందుకు ప్రణాళిక చేయడం, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి అందుబాటులో ఉన్న భవిత రిసోర్స్ సెంటర్‌లో చేర్పించాలి.
- 11న జూన్ 6 నుంచి10వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష చేపట్టాలి.
- 12న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటుబుక్‌లు, యూనిఫాం అందించాలి.
- 13న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి బాలసభ కార్యక్రమం చేపట్టాలి. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలను ఆహ్వానించాలి.
- 16న విద్యార్థులకు గణితం, చదవడం, రాయడం వంటి అంశాలపై పోటీలు నిర్వహించాలి. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలి. అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్లను తరగతి గదుల్లో ప్రదర్శించాలి.
- 17న బాలిక దినోత్సవం నిర్వహించాలి. బాల్య వివాహాలు, చిన్నారులపై వేధింపులు, బాలిక అభివృద్ధికి సంబంధించి ప్రతిజ్ఞ చేయించాలి.
- 18న పాఠశాలకు గ్రామస్తులు, తల్లిదండ్రులను ఆహ్వానించి తరగతి గదుల డిజిటలైజేషన్, ఆధునిక సౌకర్యాలను చూపించాలి. మొక్కల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయాలి.
- 19న బడిబాట ముగింపు కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించాలి.

అర్హులకే 'యువ వికాసం'

కైలాస్‌నగర్: అర్హులైన వారికే రాజీవ్ యువ వికాసం రుణాలు అందేలా జాబితాలు రూపొందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. అన్ని మండలాల్లోని బ్యాంకుల్లో దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తొలిసారి ఆర్థిక చేయూత పథకానికి దరఖాస్తు చేసుకునేవారికి, మహిళలకు 25 శాతం (ఒంటరి మహిళ, వితంతువులకు ప్రాధాన్యం), దివ్యాంగులకు 5 శాతం, తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలు, ఎస్సీ వర్గీకరణ ఉద్యమ కుటుంబాలకు, వృత్తి నైపుణ్యం గల వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉంచాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు, డీపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి అరుదైన గౌరవం


అరుణ బట్టువార్

ఇంద్రవెల్లి: బాల సాహిత్య వికాసం కోసం విశిష్ట సేవ లందిస్తూ విద్యార్థులను సాహితీ వేత్తలుగా తీర్చ దిద్దడానికి కృషి చేస్తున్న ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్‌కు అరుదైన గౌరవం దక్కింది. తన సంపాదకత్వంలో విద్యార్థులచేత ఇప్పటి వరకు ఆరు పుస్తకాలు ముద్రింపజేశారు. ఆమె సేవలను గుర్తించి ఈ నెల 25న హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా నిర్వహించే బాల సాహిత్య సమ్మేళనంలో సత్కరించనున్నారు.

ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధం

బజార్‌హత్నూర్: ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని కొంగర్ల పోతన్నకు చెందిన పశువుల కొట్టంలో బుధవారం మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్తులు ఇచ్చోడ ఫైరింజన్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రొహిబిషన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మోటర్ల ద్వారా నీళ్లు పోయించారు. కొద్ది సేపటికి ఫైరింజన్ రావడంతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనలో పశుగ్రాసంతో పాటు, వ్యవసాయ పనిముట్లు, పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.4 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ


ఇరు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

మంచిర్యాలటౌన్: సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించకుండా అవమానించడాన్ని నిరసిస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించేందుకు వెళ్తుండగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు బూతులు తిడుతూ అడ్డుకున్నారని ఎంపీ వర్గీయులు తెలిపారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతామని చెప్పినా వినకుండా తమను అడ్డుకోవడం సరికాదని యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, ఆసంపల్లి శ్రీకాంత్ అన్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగుతుండడంతో పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పున్నం, సృజన్, మాయ తిరుపతి, దాసరి సంపత్, శ్రీశైలం, అరుణ్, రాజేశ్, వెంకటేశ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్లపై మట్టికుప్పలు

- బాసరలో భక్తులకు తప్పని అవస్థలు


కలుషిత నీటిలో స్నానం చేస్తున్న భక్తులు


పుష్కర ఘాట్లపై నల్లమట్టి కుప్ప

బాసర: తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సరస్వతీ అమ్మవారు కొలువైన బాసర గోదావరిన ది పుష్కరఘాట్ల వద్ద పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొదటి పుష్కర ఘాట్ నుంచి రెండో పుష్కరఘాట్ వరకు గోదావరి నీటి ప్రవాహం తగ్గడంతో పుష్కరఘాట్లపై నల్లమట్టి పెద్దపెద్ద కుప్పలుగా పే రుకుపోయింది. బాసర సరస్వతీ అమ్మవారి సన్ని ధిలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాదు దక్షిణాది రా ష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్య స్నానం ఆచరించడం పుణ్యఫలంగా భావిస్తారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనంతో గోదావరి ఘాట్ తీరమంతా అస్తవ్యస్తంగా మారింది. బురద, చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. బాసర ప్రధాన స్నానఘాట్ పైభాగంలో గంగమ్మ విగ్రహం, ఘాట్ కిందిభాగం మెట్ల వద్ద శివలింగం ఉంది. ఇక్కడ అనేక ఏళ్లుగా ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల పారిశుద్ధ్య నిర్వహణ గాలి కొదిలేయడంతో శివలింగం కళ తప్పుతోంది. ఎంట్రన్స్‌లోనే పుష్కర ఘాట్లు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి.

కలుషిత నీటిలోనే స్నానాలు

మహారాష్ట్రలోని నాసిక్ త్రయంబకేశ్వర్‌లో పుట్టిన గోదారమ్మ బాసర వద్ద చదువులమపాదాలను తాకి తెలుగురాష్ట్రాల్లోకి అడుగిడుతుంది. ఎగువన భారీ వర్షాలు కురిసినపుడు వచ్చే వరదలతో ఘాట్లు పరిశుభ్రమవుతున్నాయే తప్ప అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. గత పుష్కరాల సమయంలో రూ.10 కోట్లు వెచ్చించి నిర్మించిన ఘాట్లు అధ్వానంగా మారిపోయాయి. ఫలితంగా పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. అంతేకాకుండా గోదావరినదిలో నీళ్లు కూడా కలుషితం అయ్యాయి. ఆలయ అధి కారులు భక్తుల సౌకర్యార్థం షవర్స్ ఏర్పాటు చేసినా కొంత మంది భక్తులు కలుషిత నీటిలోనే స్నా నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు స్పందించి పుష్కరఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

విదేశీ పర్యటనకు ఏవో

- మంత్రులు, ఐఏఎస్‌లతో కలిసి వెళ్లనున్న విశ్వనాథ్
- బెల్లంపల్లికి చెందిన హార్టికల్చర్ అధికారి కూడా..


విశ్వనాథ్, ఏవో

ఆదిలాబాద్‌టౌన్: వ్యవసాయ శాఖ ద్వారా విదేశాల్లో అధ్యయనం కోసం ఆ శాఖ మంత్రి, ఐఏఎస్ అధికారులతో కూడిన బృందాన్ని పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బృందంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం.రఘునందన్‌రావు, రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కె.సురేంద్ర మోహన్, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తదితరులు ఉన్నారు. వీరితో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తున్న విశ్వనాథ్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన ఉద్యానవన అధికారి జె.అర్చన ఎంపికయ్యారు. వీరు నెదర్లాండ్, ఫ్రాన్స్‌లోని ప్యారీస్‌లలో పర్యటించనున్నారు. జూన్ 10 నుంచి 15 వరకు కొనసాగే పర్యటనలో ఆ దేశాల్లో వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగు స్థితిగతులు, దిగుబడులు సాధించేందుకు అనుసరిస్తున్న విధానాలు, నూతన వంగడాల సృష్టికి అవలంబిస్తున్న పద్ధతులు వంటి పలు అంశాలపై అధ్యయనం చేయనున్నారు. మూడు రోజుల చొప్పున ఆయా దేశాల్లో పర్యటిస్తారు. రాష్ట్ర బృందంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు ఉండటంతో ఇక్కడి రైతులకు సాగుపరంగా ప్రయోజనం కలిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదుపులోకి మరికొందరు నిందితులు!

- ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో కొనసాగుతున్న విచారణ

దహెగాం/పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో గత వారం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి పెద్ద పులి మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు మంగళవారం రాత్రి, బుధవారం పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ, దహెగాం మండలంలోని గెర్రె, అమరగొండ గ్రామాలకు చెందిన పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఎల్లూర్ అటవీ ప్రాంతంలో మృతి చెందిన పెద్దపులి అవశేషాలు దహెగాం మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి పెరట్లో పాతిపెట్టిన వాటిని బయటకు తీసిన విషయం తెలిసిందే. గ్రామ సమీపంలోని ప్లాంటేషన్ వద్ద పాతి పెట్టిన పులిచర్మం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం కాగజ్‌నగర్ వైల్డ్ లైఫ్ సీసీఎఫ్ ఎల్‌వి సింగ్, సీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టోబ్రియల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పులి అవశేషాలు లభించిన ఎల్కరి శేఖర్ ఇంటికి వెళ్లి అతని భార్యను సైతం విచారించారు. పులిని ఖననం చేసిన ప్రదేశానికి వెళ్లి మరోసారి పరిశీలించారు. దహెగాం మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన ఒకరు, అమరగొండ, కర్జి గ్రామాలకు చెందిన మరో ఎనిమిది మందిని, పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ గ్రామాలకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులో ఉన్న వారి కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. పులి అవశేషాలు అమ్మకానికి బేరం పెట్టారా? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. కాగా ఎలాంటి సమాచారం లేకుండా విచారణ పేరుతో అమాయకులను అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పులిని హతమార్చిన వారిని శిక్షించి అమాయకులను వదిలిపెట్టాలని వేడుకుంటున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్..

పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలతో పెద్ద పులిని హతమార్చిన ప్రాంతాన్ని వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మెరు బుధవారం పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పొచ్చరకు చెందిన కొలిపెల్లి వినయ్ (19) మావల మండలంలోని ఓ పెట్రోల్ పంపులో పని చేసేవారు. నెల రోజుల నుంచి పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం పొచ్చర శివారు ప్రాంతంలోని జాతీయ రహదారి సమీపంలో ఉరేసుకున్నాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన చింతల నారాయణ (59) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణ పలుచోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులకు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు యువకుల బైండోవర్


బైండోవర్ చేస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్నారన్న అనుమానంతో జిల్లా కేంద్రంలో ఇద్దరు యువకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. గుండంపెల్లి గ్రామానికి చెందిన సత్యపోలు యోగేష్, భైంసా పట్టణం పురాణ బజార్‌కు చెందిన షేక్ కైఫ్ జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా వారి వద్ద ఎలాంటి గంజాయి లభించలేదు. కానీ భవిష్యత్‌లో గంజాయి సేవించడం లేదా విక్రయిస్తారన్న అనుమానంతో వారిద్దరిని రూరల్ తహసీల్దార్ సంతోష్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టోల్ ట్యాక్స్ నిలిపివేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట సమీపంలోని వైజంక్షన్ వద్ద టోల్ ట్యాక్స్ నిలిపి వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో టోల్‌గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ట్యాక్స్ పేరుతో దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. అటవీశాఖలో ఎక్కడా ఈ టాక్స్‌లు వసూలు చేయడం లేదన్నారు. కాళేశ్వరంలో పుష్కరాలు నిర్వహిస్తున్న సమయంలోనే ఈ ట్యాక్స్ వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తుల సమ్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్‌గౌడ్, బుర్ర రాజశేఖర్‌గౌడ్, తుమ్మ శ్రీపాల్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పనులపై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి నూతనంగా ఏర్పాటు చేస్తున్న 67.5 మెగావాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ పనులపై ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ బుధవారం ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు అధికారులను అడిగి పనుల అభివృద్ధిని తెలుసుకున్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జీఎం (ఈఅండ్‌ఎం) సోలార్ ఎనర్జీ జీఎస్ జానకీరామ్, ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా ఇంజనీర్ (ఈఅండ్‌ఎం) వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, కేకే గ్రూపు ఏజెంట్ రాంబాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఐఈడీ రాజన్న పాల్గొన్నారు.

ఇసుక ఫిల్టర్ చేసే బోట్ సీజ్


సీజ్ చేసిన ఇసుక ఫిల్టర్ బోట్‌తో పోలీసులు

జైనథ్: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక ర వాణా చేస్తున్న వ్యాపారి అభిలాష్‌రెడ్డితో పాటు సాంగ్వి గ్రామ వీడీసీ సభ్యులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పెన్‌గంగ నది శివారులోని సాంగ్వి గ్రామం వ ద్ద ఎస్సై గౌతమ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉల్లాస్, సిబ్బందితో కలిసి దాడి చేసి ఇసుకను ఫిల్టర్ చేసే బోట్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుక దొంగతనం, పీడీపీపీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దాడి చేసిన వ్యక్తికి జరిమానా

మంచిర్యాలక్రైం: కోర్టు ఆవరణలో ఒకరిపై దాడికి పాల్పడిన వ్యక్తికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక సివిల్ కోర్టు జడ్జి కే.నిరోషా బుధవారం తీర్పునిచ్చినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. గౌతమినగర్‌కు చెందిన బిల్ల మల్లయ్య హైటెక్ సిటీకి చెందిన ఆజ్మీర రాజేశ్‌పై చెక్‌బౌన్స్ కేసు వేశా డు. 2017 సెప్టెంబర్ 14న కోర్టులో హాజరయ్యేందుకు రాగా రాజేశ్ కోర్టు ఆవరణలో మల్లయ్యపై దాడికి పాల్పడ్డాడు. కేసు వాపస్ తీసుకొమ్మని బెదిరించాడు. మల్లయ్య అప్ప టి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జికి ఫి ర్యాదు చేశాడు. ఫిర్యాదును స్థానిక పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశాలతో రాజేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు


నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

జైనథ్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద బుధవారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌కాలనీకి చెందిన సాహీల్ , ముషీర్ గంజాయి విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పేకాడుతున్న 13 మంది..

నేరడిగొండ: పేకాడుతున్న 13 మందిని బుధవారం అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి వెళ్లి మండల కేంద్రంలోని నీలిమ దాబా వెనకాల దాడులు నిర్వహించి పేకాడుతున్న 13 మందిని పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలతో పాటు రూ.14,080 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సయ్యద్ జహీర్, గడ్డం రవి చందర్‌రెడ్డి, గూడూరు లవకుమార్, రాథోడ్ రవీందర్, అల్లూరి శివారెడ్డి, ఉప్పు పోశెట్టి, సోలంకి శ్రీనివాస్, నల్ల అడెల్లు, సోలంకి కరన్ సింగ్, గోతి గులాబ్ సింగ్, మాడ గంగాధర్, అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, పవార్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టపాసులతో ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అర్ధరాత్రి టపాసులు పేల్చి జనాలను ఇబ్బందికి గురిచేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన చోట ముష్రఫ్ తన జన్మదినం సందర్భంగా ఇంటి ముందు, బిల్డింగ్‌పై బాణసంచాలు పేల్చాడు. దీంతో చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురయ్యారు. ఓ ఇంటిపై వేసిన ప్లాస్టిక్ కవర్‌కు నిప్పంటుకోవడంతో కొంతభాగం కాలిపోయింది. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఐదుగురిపై..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతం మీదుగా ఎలాంటి డాక్యుమెంట్‌లు లేకుండా వాహనంలో రెండు ఎడ్లను తరలిస్తున్న రాథోడ్ నితిన్, షేక్ సాకీర్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. అలాగే వాహనాన్ని అడ్డుకుని బెదిరింపులకు గురి చేసిన చాందా (టి) గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై రాథోడ్ నితిన్, షేక్ సాకీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పండ్ల వాపారిపై దాడికి పాల్పడిన షన్ను, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో తోపుడు బండ్లపై షేక్ షహెబాజ్ పండ్లు విక్రయిస్తున్నాడు. ఎద్దు వచ్చి పండ్లను తింటుండగా అతను ఎద్దును కొట్టడంతో షన్నుకు తగిలింది. దీంతో ఆయన ద్విచక్ర వాహనం దెబ్బతింది. ఇందుకు రూ.2వేలు ఇవ్వాలని అడిగాడు. తనవద్ద లేవని చెప్పడంతో తన మిత్రులను పిలిచి షహెబాజ్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

'ప్రభుత్వ ఉద్యోగులపై ఆరోపణలు సరికాదు'


ఫిర్యాదు చేస్తున్న నాన్ గెజిటెడ్ ఉద్యోగులు

జైపూర్: జైపూర్ మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతిపై మాదిగ హక్కుల దండోరా నాయకులు చేసిన అసత్యపు, నిరాధారమైన ఆరోపణలు ఖండిస్తున్నామని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం మందమర్రి యూనిట్ అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి సతీశ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై కక్షపూరితంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, సభ్యులు రవిచందర్, శ్రీనివాస్, ప్రశాంత్, సత్యనారాయణ, సురేశ్, ఉదేయ్‌కుమార్, స్వామి, అపర్ణదేవి, రజిత, విజయ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు కొంటున్నారా?

- జాగ్రత్తలు తప్పనిసరి


జొన్న విత్తనాలు

చెన్నూర్‌రూరల్: మరికొద్ది రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభమవుతోంది. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలులో రైతులు బిజీ అవుతున్నారు. ఇలాంటి సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అనుమతులు లేని కంపెనీలకు చెందిన విత్తనాలు, కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచించి అన్ని వివరాలు పరిశీలించాకే కొనుగోలు చేయాలి. అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలని చెన్నూర్ ఏవో యామిని సూచించారు. లైసెన్స్ లేని దుకాణాలు, దళారుల వద్ద ఎక్కడపడితే అక్కడ కొనుగోలు చేయకూడదు. సరుకు, లాట్ నంబర్, తయారీ, తేదీ, రకం ఇలా అన్ని వివరాలు ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారు (షాపు) నుంచి తప్పనిసరిగా తీసుకోవాలి. సంచులపై సీల్ తీసినట్లు లేదా విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే తీసుకోకూడదు. వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలి. క్రిమిసంహారక మందుల డబ్బాలపై కంపెనీ పేరు, తేదీ, కాలపరిమితి, గమనించి రసీదులు తీసుకోవాలి. ఏది ఎంత ధరతో కొన్నా.. డీలర్ లేదా దుకాణాదారు సంతకంతో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి. మీరు తీసుకున్న విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు నకిలీవని అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి. అలాగే లాట్ నంబర్, తయారీ తేదీలను తప్పనిసరిగా చూసుకోవాలి. లేదంటే గతేడాది విత్తనాలు, మందులు, ఎరువులు అంటకడతారు. రైతులు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండి కాలం చెల్లిన మందులు, ఎరువులు, విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనకూడదు. అలాగే మందు డబ్బాలపై ఆకుపచ్చని లేబుల్ ఉందో లేదో గమనించాలి. ఆకుపచ్చ లేబుల్ ఉంటేనే ఆ మందును కొనుగోలు చేయాలి. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు విషయంలో రైతులు ఈ జాగ్రత్తలు తప్పకుండా పాటించి నాణ్యమైన దిగుబడులు పొందాలి.

నింగీ నేల ఏకమైనట్లు ఆవిష్కృతమైన అద్భుత చిత్రం



ఆకాశం మేఘావృతం కావడంతో ఇలా నేలను తాకుతుందేమో అనేట్లుగా కలిసిపోయిన చిత్రం బుధవారం సాయంత్రం సిరికొండ శివారులోని పంటచేనులో ఆవిష్కృతమైంది. పంటచేలలో వేసవి దుక్కులతో బిజీగా ఉన్న అన్నదాతలకు ఈ చిత్రం కనువిందు చేసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు మొదలై వర్షం కురిసింది.

– సిరికొండ